పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

## అమల్లోకి కొత్త చట్టాలు

- పోస్టర్‌ను విడుదల చేసిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూలై 2 : దేశంలో కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులకు కొత్త చట్టాలపై పలు సూచనలు చేస్తూ చట్టాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశమంతటా మారిన చట్టాలు అమల్లోకి వచ్చినందున ప్రజలంతా వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచి దేశంలో ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేసేవిధంగా కొత్తచట్టం ఈ ఎఫ్ఐఆర్ అనే విధానాన్ని తెచ్చిందని ఎస్పీ పేర్కొన్నారు. మారిన చట్టాలకు అనుగుణంగా సోమవారం నాగర్‌కర్నూల్‌జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయని, నాగర్‌కర్నూల్ పీఎస్‌లో ఒకటి, చారకొండ పీఎస్‌లో మరో కేసు నమోదైనట్లు ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ అదనపు ఎస్పీ భరత్, డీఎస్పీలు సత్యనారాయణ, చారితోపాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఉపేందర్‌రావు, శంకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయి విద్యనందించాలి

పెంట్లవెల్లి, జూలై 2 : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళపై కొందరు దుండగులు దాడి చేయగా హైదరాబాద్‌లో చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకున్నది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు తరుణ్ మంగళవారం చెంచు మహిళను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెంచు మహిళపై జరిగిన ఘటన అమానుషమని, ఇంత దారుణానికి పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. అదేవిధంగా ఆమె పిల్లలు అనిత, నీలవేణి, జ్యోతికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు ఉన్నారు.

## పేద విద్యార్థినికి ఎన్నారై ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఎన్నారై కుటుంబసభ్యులు

పెంట్లవెల్లి, జూలై 2 : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామానికి చెందిన శంకరమ్మ, శ్రీనివాసులు కుమార్తె ఇంటర్ ఫస్టియర్ (పాలిటెక్నిక్) హాస్టల్ ఫీజు కట్టడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతుందని, దాతలు సహకరించాలని సామాజిక నాయకుడు ఆకునమొని చంద్రయ్య సోషల్ మీడియాలో కోరాడు. దీంతో ఇదే గ్రామానికి చెందిన ఎన్నారై వడ్ల వెంకటేశ్వరాచారి మంగళవారం స్పందించి విద్యార్థినికి మూడేండ్లకు హాస్టల్‌కయ్యే ఖర్చు రూ.30వేలు తాను భరిస్తానని ముందుకొచ్చారు. మొదటి ఏడాదికి గానూ రూ.10వేలను తన కుటుంబసభ్యులతో విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్, సామాజిక నాయకుడు చంద్రయ్య, కుర్మయ్య ఉన్నారు.

## డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి గిఫ్ట్ స్కీం

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 2 : జూలై 1వ తేది నుంచి టీజీఎస్ ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కోసం గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టడం జరిగిందని నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ దేవరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి కర్నూల్ రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు తమ టికెట్ వెనుకాల తమ పేరు, ఫోన్ నెంబర్, అడ్రస్ రాసి డ్రైవర్ వెనుకాల ఉన్న లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. ఈ బాక్సులను నెలలో రెండు సార్లు ప్రతి నెలా 16వ తేదీ, 30లేదా 31వ తేదీల్లో డ్రా మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ ఆధ్వర్యంలో తీసి ముగ్గురు చొప్పున బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళా ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పోలీస్ కార్యాలయంలోని చెట్లు వేలం

నాగర్‌కర్నూల్, జూలై 2 : జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ కార్యాలయం ఆవరణలోని చెట్లను వేలం వేస్తున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బంక్ నిర్మిస్తున్న స్థలంలో ఉన్న వేప, టేకు, దేవదారి చెట్లను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. 5వ తేదీన ఉదయం 10గంటలకు ఏఆర్ డీఎస్పీ ఆధ్వర్యంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొని చెట్ల భాగాలను సొంతం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

## టీచర్లను రిలీవ్ చేయాలి

నాగర్‌కర్నూల్, జూలై 2 : ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేసి కొత్త స్థానాల్లో చేరేలా అధికారులు చర్యలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, శ్రీధర్‌శర్మ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పదేండ్లుగా పదోన్నతులు లేక, ఆరేండ్లుగా బదిలీలు చేపట్టకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు దిగజారిపోయాయని, ఎన్నో ఆందోళనలు పోరాటాలు నిర్వహిస్తే కోర్టు కేసులు తదితర అవాంతరాలను అధిగమించి పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యి ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరిందన్నారు. జిల్లాలో 561మంది ఎస్జీటీలు బదిలీలు పొందగా విద్యాశాఖ అధికారులు అకస్మాత్తుగా 2015లో తీసుకువచ్చిన రేషనలైజేషన్ నిబంధనలను అమలు చేస్తుండడంతో బదిలీ పొందిన ఎస్జీటీల్లో కేవలం 40శాతం మంది కూడా రిలీవ్ కాలేకపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సీనియర్, మహిళా టీచర్లు ఈ చర్యలతో తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారన్నారు. ప్రైమరీ స్కూల్స్ బలోపేతం కావాలంటే నిబంధనల మేరకు బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేసి మిగిలిన ఖాళీల్లో తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించాలని వారు సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755
ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# గ్రామాలాభివృద్ధికి నిరంతర కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, జూలై 2: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తానని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెద్దకొత్తపల్లిలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.కోటి 75లక్షల నిధులతో నిర్మించిన తాసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంల ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గతంలో నేను మంత్రిగా ఉన్నప్పుడు మండలానికి రూ.30 కోట్లు నిధులు మంజూరు చేశానని గుర్తు చేశారు. పెద్దకొత్తపల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పీఎంఆర్ఐ గార్డెన్‌లో ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ ప్రతాప్ గౌడ్, జెడ్పీటీసీ గౌరమ్మ మాట్లాడుతూ ఐదేండ్లలో ప్రభుత్వం ద్వారా మంజూరైనదేండ్లతో గ్రామాలను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగరాజు, నాయకులు దండు నర్సింహ, చంద్రయ్య, విష్ణు, వెంకటేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో తాసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కృష్ణారావు

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బిజినేపల్లి, జూలై 2 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలెం గ్రామానికి చెందిన సిద్దు బైక్‌పై పాలెం నుంచి నాగర్‌కర్నూల్ వైపునకు వెళ్తుండగా వెంకటాపూర్ గ్రామ సమీపంలో కుక్క అడ్డుగా రావడంతో కిందపడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిడి స్థానికులు నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి రూరల్, జూలై 2 : బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన కల్వకుర్తి పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం సిరిపురానికి చెందిన సాయిదీపక్, నవీన్ బైక్‌పై మంగళవారం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈక్రమంలో కల్వకుర్తిలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ సమీపంలోకి రాగానే బైక్‌పై ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా వారిని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సాయిదీపక్‌ను హైదరాబాద్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కొల్లాపూర్, జూలై 2 : కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ తల్లి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు సీపీఎం నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి మంగళవారం పరామర్శించారు. అశోక్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని పర్వతాలు పేర్కొన్నారు.

## తిప్పారెడ్డిపల్లికి తృతీయ బహుమతి

వంగూరు, జూలై 2 : జిల్లా కేంద్రంలో జూన్ 30న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కోలాట పోటీలు నిర్వహించారు. కాగా మండలంలోని తిప్పారెడ్డిపల్లి కోలాట బృందానికి మూడో బహుమతి వచ్చినట్లు బృందం నిర్వాహకుడు పంతులు కృష్ణయ్య మంగళవారం తెలిపారు. 23 బృందాలు పాల్గొంటే తిప్పారెడ్డిపల్లికి మూడో బహుమతి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## చెరువుల్లో చేపపిల్లలను వదలాలి

బిజినేపల్లి, జూలై 2 : గత ప్రభుత్వం వ్యవసాయం దాని అనుబంధ సంస్థల్లో వెలుగు నింపడం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు కూడా చెరువులో చేపపిల్లల్ని వదలలేదని, వెంటనే విడవాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(మేపా) జిల్లా అధ్యక్షుడు లోకేశ్ మంగళవారం ప్రకటనలో కోరారు. విడుతల వారీగా గత ఏడాది వరకు చెరువుల్లో చేపపిల్లల్ని వదలడం జరిగిందని, దాంతో మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి లభించిందని, ఈసారి మాత్రం నేటికీ చేప పిల్లలను చెరువుల్లో వదిలే విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మత్స్యకారులకు చెప పిల్లలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఊరకుక్కల దాడిలో జింక మృతి

అచ్చంపేట రూరల్, జూలై 2 : పట్టణ శివారులోని శివసాయినగర్ కాలనీలో జింక మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. తెల్లవారుజామున అడవిలోంచి తప్పిపోయి శివసాయినగర్ కాలనీలోకి వచ్చిన జింకను ఊరకుక్కలు వెంబడించి దాడిచేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాలనీవాసులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆర్ఎంపీల వినతి

ఎమ్మెల్యే వంశీకృష్ణను సన్మానిస్తున్న ఆర్ఎంపీలు

అచ్చంపేట రూరల్, జూలై 2 : ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణను ఆర్ఎంపీలు కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఆయనను పూలమాల, శాలువాతో సన్మానించారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 2 : అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి ఎవరైనా ఏ చిన్న సమస్య ఉందని వచ్చినా వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో ఇంటి పన్నులు వసూలు చేసి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సమావేశంలో మేనేజర్ యాదయ్య, ఆర్ఐ పెంటయ్యతోపాటు బిల్ కలెక్టర్లు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నరేష్‌బాబు

## సమస్యల నిలయంగా ఎస్టీ బాలుర హాస్టల్

విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న ధర్మానాయక్

లింగాల, జూలై 2 : మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో సమస్యలు తిష్ట వేశాయని.. వెంటనే పరిష్కరించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్టీ హాస్టల్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. హాస్టల్ పైకప్పు ప్రమాదభరితంగా మారిందని, ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారని పేర్కొన్నారు. మరుగుదొడ్లు లేక ఊరి బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, స్కూల్ ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా ఇంతవరకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేయలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సొసైటీ బలోపేతానికి కృషి చేయాలి

- డీసీవో రఘునాథ్‌రావు

బిజినేపల్లి, జూలై 2 : సింగిల్‌విండో సొసైటీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీసీవో రఘునాథ్‌రావు అన్నారు. మంగళవారం బిజినేపల్లిలోని విండో కార్యాలయంలో రైతు భరోసాపై ప్రత్యేక సర్వసభ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో డిపాజిట్లు పెంచాలని, సొసైటీ అభివృద్ధికోసం శాఖాపరంగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, విండో చైర్మన్ బాల్‌రాజుగౌడ్, ఏవో నీతి, రవి, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

మాట్లాడుతున్న డీసీవో రఘునాథ్‌రావు

## జవాన్‌ల సేవలు వెలకట్టలేనివి

- ఉద్యోగ విరమణ పొందిన సైనికుడికి సన్మానం

జవాన్‌ను ఊరేగిస్తున్న నాయకులు

వెల్దండ, జూలై 2 : దేశానికి సైనికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని వెల్దండ సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన జవాను రంగరాతి తిరుపతయ్య మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వెల్దండ ప్రస్తుత, మాజీ జవాన్లు స్థానిక ఆకృతి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సన్మాన సభ నిర్వహించారు. అంతకుముందు మండలకేంద్రంలో భారీ ర్యాలీ తీసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో పాటు జవాన్లు, నాయకులు తిరుపతయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ఎర్ర శ్రీను, కృష్ణ, జవాన్లు మట్ట చంద్రశేఖర్, రాము, శ్రీను, తిరుపతి, వెంకటేశ్, పురుషోత్తం, రవూఫ్ ఉన్నారు.

## ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు

తాడూరు, జూలై 2 : మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రోహిణి, ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శివలీలతో పాటు పలువురు ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులను ఎంపీడీవో జ్యోతి పరోసియా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్‌రెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు →

## 660 కిలోల బెల్లం పట్టివేత

- ఒకరిపై కేసు నమోదు

లింగాల, జూలై 2 : వ్యవసాయ పొలంలో భారీగా బెల్లం స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసిన మండలంలోని రాయవరంలో చోటుచేసుకున్నది. తెల్కపల్లి ఎక్సైజ్ శాఖ సీఐ మరణయ్య కథనం మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు రాయవరం శివారులోని పొలాల్లో మంగళవారం దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా 22 సంచుల్లో 660 కిలోల బెల్లం, 30కిలోల అల్లం, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని శ్రీను అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వాటి విలువ దాదాపు రూ.50వేలు ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్సై జనార్దన్, నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, ఏఈఎస్ సుధాకర్ పాల్గొన్నారు.

పట్టుబడిన నల్లబెల్లాన్ని చూపుతున్న ఎక్సైజ్ శాఖ సీఐ

## మహిళా సమాఖ్యకు రూ.5కోట్లు మంజూరు

చారకొండ, జూలై 2 : మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు అచ్చంపేటలో నిర్వహించిన సమావేశంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా మండలంలోని మహిళా సంఘాలకు రూ. 5కోట్లు అందజేసినట్లు ఏపీఎం బాలచందర్ మంగళవారం పేర్కొన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కోసం రుణాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీసీలు విమల, మాధవి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కుంటను తలపిస్తున్న రోడ్డు

## బురదమయంగా ప్రధాన రోడ్డు

కోడేరు, జూలై 2 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు గుంతల్లో నీళ్లు మళ్లుకొని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లోని ప్రధాన రహదారి నుంచి సంతబజారుకు వెళ్లే రోడ్డుపై గుంతలమయంగా మారి వర్షపు నీళ్లు రోడ్డుపై నిల్వ ఉంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై మట్టి వేసి బురదమయం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## దాడిపై విచారణ జరిపించాలి

కొల్లాపూర్, జూలై 2 : మొలచింతపల్లి గ్రామంలో చెంచు మహిళపై జరిగిన దాడి, చెంచు నాగన్న మృతిపై విచారణ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని కేఎల్ఐ గేస్ట్‌హౌస్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మనాయక్ మాట్లాడుతూ చెంచు మహిళపై జరిగిన దాడిపై సగ్రమ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిందితులకు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు శివ వర్మ, బాలపీరు, దశరథం, సలీం, సురేందర్, సతీశ్, కిరణ్, బత్తిని రాజు, సంజీవ్, తరుణ్, శివకుమార్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలను అందజేస్తున్న దాతలు

## దాతలు సహకరించాలి

కల్వకుర్తి రూరల్, జూన్ 2 : ప్రభుత్వ బడులు, విద్యార్థుల అభివృద్ధికి దాతలు సహకరించాలని పంజుగుల ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎల్లయ్య కోరారు. మంగళవారం మండలంలోని పంజుగుల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన సూదిని శ్రీనివాస్‌రెడ్డి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో 6, 7 తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి విద్యార్థికి రూ.రెండువేలు, రెండో విద్యార్థికి రూ.1500 ప్రోత్సాహక బహుమతులను అందించటంతోపాటు పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకుడు కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సమావేశం

కల్వకుర్తి రూరల్, జూలై 2 : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ధ్యాప గోపాల్‌రెడ్డి సమావేశ మందిరంలో ఎంపీపీ సామ మనోహర అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీవో వెంకట్రాములు మంగళవారం పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

***చారకొండలో..***

చారకొండ, జూలై 2 : మండల కేంద్రంలో ఎంపీపీ నిర్మల అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ హాజరవుతారన్నారు. రేపటితో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండటంతో వీడ్కోలు సమావేశం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

## నేడు ఎంపీపీ వీడ్కోలు సమావేశం

తిమ్మాజిపేట, జూలై 2 : తిమ్మాజిపేట ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

## ఆర్థికసాయం అందజేత

వెల్దండ, జూలై 2 : మండలంలోని పోతెపల్లికి చెందిన నూనె సిత్తారమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు కొండల్‌యాదవ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు చిట్టి శివ, అంజియాదవ్, వరుణ్, మహేశ్‌యాదవ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఉప్పునుంతల, జూలై 2 : బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలకేంద్రం శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం అమ్రాబాద్ మండలం బీకే తిర్మలాపూర్‌కు చెందిన రవి(25) తన మేమమామను కలిసేందుకు సోమవారం ఉప్పునుంతలకు వచ్చాడు. రాత్రి 10:30 గంటలకు తిరుగు ప్రయాణం కాగా మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడి మృతి చెందాడు. రవ